కళ్లల్లో పెళ్లి

# ఇంటి భారతం

రాజయ్య మతలబు మనిషి.

అన్నీ సవ్యంగా ఉండటం అతనికి నచ్చదు.

ఇంట్లో సమస్యలు లేకపోయినా ఏదోక సమస్య సృష్టిస్తాడు. ఆ సమస్య సృష్టించబడ్డప్పుడే అతనికి గుర్తింపు ఉంటుందని అతనికి తెలుసు.

గ్రంథాలయం అరుగులమీద కూర్చుని 'ఊళ్లో అందరూ ఐకమత్యంగా ఉండాలని'' ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తాడు. ఇంటికి రాగానే ఇరుగుపొరుగు వాళ్లతో పేచీలు పెట్టుకుంటాడు. ఊళ్లోవాళ్లు తనని మర్చిపోతున్నారని తన వ్యక్తిత్వానికి గుర్తింపు ఇవ్వడంలేదని అన్పించినప్పుడు తన తాతగారు బందిపోటు దొంగలను ఎలా ఎదిరించింది గంటల తరబడి చెబుతాడు. తండ్రి ధైర్యసాహసాలు రాజయ్యకి రాలేదుగానీ తల్లి మడత పేచీలు మాత్రం బాగా అబ్బాయి.


రాజయ్య కొడుకులు కూడా పెద్దవాళ్లవ్వడంతోనే కథ అడ్డం తిరిగింది. ఇంట్లో అతని పెత్తనం సాగడంలేదు.

పెద్దకొడుకు కనకారావు నాటకాలు వేస్తూ ఇంటిపట్టున ఉండకుండా తిరిగినన్నాళ్లూ రాజయ్యకి ఇబ్బందులు ఎదురవ్వలేదుగాని, పెద్దకొడుక్కి ఉద్యోగం దొరికి ఇంటిపట్టునే ఉండటంతో చిక్కులొచ్చేయి. తన వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం రాజయ్యకి సుతారామూ నచ్చలేదు.

కనకారావు మూడీమనిషి. ఏ క్షణాన ఏ నిర్ణయం తీసుకుంటాడో ఎవ్వరూ ఊహించలేదు. ఇంటి పరిస్థితులు బాగుచెయ్యాలనే తపన ఉందిగాని దుబారా మనిషి. తొందరపాటు ఎక్కువ మనిషికి. తొందరపాటు నిర్ణయాలతో చాలామందికి శత్రువయ్యాడు.

ఇంటిపెత్తనం చేతికిరాగానే ఇంటి స్వరూపం మార్చివేశాడు. ఇంట్లో పనిచేసే నౌకరును తీసేశాడు. తన ఇల్లు ప్రత్యేకంగా కనబడాలని పచ్చరంగు వేయించేడు. రెండో తమ్ముడు టీచర్‌గా పనిచేస్తూ వ్యాపారం కూడా మొదలుపెడితే, వ్యాపారం మాన్పించేడు.

కనకారావు మొండితనం రాజయ్యకి నచ్చేదికాదు.



రాజయ్య టక్కుటమారాలు కనకారావుకి నచ్చేవికావు.

పెద్దకొడుకుకు ఇంట్లో చికాకులు కల్పిస్తే ఆ వూరూ ఈ వూరూ తిరుగుతూ తను చేసే దుబారా ఖర్చును పట్టించుకోడని ఓ ఎత్తువేశాడు రాజయ్య. చిన్నకొడుకు కృష్ణారావుని కనకారావు పైకి వుసిగొల్పేవాడు. ఇద్దరిమధ్య పోట్లాట పెట్టేవాడు. చుట్టపుచూపుగా వొచ్చిన కృష్ణారావు అత్తగారు కూడా కనకారావుమీద కారాలు, మిరియాలు నూరేటట్లు చేసేవాడు మన రాజయ్య.

ఇంట్లోకి కావాల్సిన సరుకులన్నీ రాజయ్యే తెచ్చే


— అలపర్తి రామకృష్ణ

వాడు. నెలలో ఓ పదిరోజులు చుట్టుపక్కల ఊళ్లన్నీ తిరిగివచ్చే అలవాటు ఉంది కాబట్టి డబ్బుతో అవసరం ఏర్పడేది. కిరాణా కొట్లో సరుకుల ధరలు ఎక్కువ రాయించి పై డబ్బు తన జేబులో దాచుకొనేవాడు రాజయ్య. రాజయ్య బలహీనత కనిపెట్టి కిరాణా కొట్టువాడు కూడా తూకం తక్కువ తూయించి పొట్లాలు కట్టేవాడు. ఆ సంగతి కనకారావుకి తెలిసిపోవడంతో తానేవెళ్లి సరుకులు తెచ్చుకోవడం మొదలుపెట్టాడు.

తండ్రిచేసే తిక్కపనులన్నీ భరించేడుగాని తన కొడుకును చెడగొట్టే ప్రయత్నం తండ్రి చెయ్యడంతో సహించలేకపోయాడు కనకారావు.

ఎక్కడకు వెళ్లినా మనవడిని వెంటబెట్టుకుని వెళ్లడం మొదలుపెట్టాడు రాజయ్య. రోజూ మనవడికి పావలో అర్థో ఇస్తూ ఉండేవాడు.

''రవికి మీరు రోజూ డబ్బులు ఇవ్వడం బాగుండలేదు'' అన్నాడోరోజు తండ్రితో కనకారావు.

రాజయ్యకు కోపం వచ్చింది.

''నా మనవడికి నేను డబ్బులు ఇస్తే నీదేంపోయింది. నా పేరనవున్న ఇల్లు కూడా వాడికే రాసి ఇస్తా! మధ్యలో నీ నసుగుడు ఏమిటి?'' గట్టిగా అరవడం మొదలుపెట్టాడు. చుట్టుపక్కలవాళ్లు వినాలని ఆయన తాపత్రయం.

''వాడికి కొనుక్కోవటం అలవాటయితే చెడిపోతాడు. చిల్లరతిళ్లు తిని వాడి ఆరోగ్యం చెడిపోతుంది''

''వాడి బాగోగులు నాకు తెలుసు! నువ్వేం చెప్పనక్కర్లేదు''

''తండ్రిగా నాకంటే మీకు రవిగాడి మీద ఎక్కువ హక్కులున్నట్లు మాట్లాడుతున్నారే?''

''నీ తండ్రిని నేననే విషయం నీకు తెలుసు కదా!... రవి నా మనవడు... తాత— మనవడి బంధం ఏమిటో లోకంలో అందరికీ తెలుసు. గుడ్డువొచ్చి పిల్లని వెక్కిరించినట్లు నువ్వేం నాకు చెప్పక్కర్లేదు. వాడికి కావాల్సినవి కొనిపెట్టవ్! వాడికి సరైన పుస్తకాలు, పెన్సిల్, పెన్ను లేదు... వొంటిమీద సరిగ్గా బట్టలుండవు. ఏమిట్రా నీ బోడి పెంపకం! నిన్ను ఇలాగే పెంచానా? నువ్వేమో డబ్బులు మింగేసి నా మనవడి సంగతి పట్టించుకోకపోతే వాడి గతేంగాను?

''నన్ను సరిగ్గా అర్థం చేసుకోండి నాన్నగారూ! డబ్బు ఎలా ఖర్చు పెట్టుకోవాలో తెలియని వయస్సు వాడిది. వాడిమీద అజమాయిషీ లేకుండా ఎప్పుడువడితే అప్పుడు డబ్బులు ఇచ్చి చెడగొడితే ఎలా? మీరు తండ్రి అంటే భయం లేకుండా చేస్తున్నారు. వాడికి నా అవసరం లేనట్లు మీరు వాడిని దరిచేరిస్తే వాడి భవిష్యత్ చెడిపోతుంది. మీరు నాలుగురోజులు మురిపెంగా మూడు రూపాయలు విదిల్చితే సరిపోతుందా? మీరున్నప్పుడు సరే... ఆ తర్వాత వాడికి నా ఆసరా కావాల్సిందేగా!'' అన్నాడు శాంతంగా కనకారావు.

''అంటే ఏమిట్రా నీ ఉద్దేశం? నేను నాలుగయిదేళ్లకు చచ్చిపోతాను... ఆ తర్వాత వాడు నీ పంచన చేరక తప్పదని బెదిరిస్తున్నావా?'' ఈ మాటలు రోడ్డుమీదకు వెళ్లి గట్టిగా అనేశాడు రాజయ్య.

చుట్టుపక్కలవాళ్లు రాజయ్య చుట్టూ మూగేరు. ఏదో వింత జరుగుతున్నదని పసిగట్టారు.

అక్కడకు రవి వచ్చేడు అప్పుడే.

''రారా రవి! సినిమాకు వెళ్దాం'' అన్నాడు రాజయ్య వాడిచేయి పట్టుకుంటూ.

''ఇప్పుడేం సినిమా? చదువుకునే సమయంలో సినిమాలకు తీసికెళ్లి పిల్లవాడిని చెడగొట్టేస్తున్నారు'' అన్నాడు కనకారావు కోపంగా.

సినిమా అనగానే తాతయ్యకి అతుక్కుపోయాడు రవి. అప్పుడే అటుకేసి వచ్చాడు భూషయ్య.

''రాజయ్య మావా! నా బ్యాంక్ ఎకౌంట్‌లో నువ్విచ్చిన వెయ్యి రూపాయలు జమచేశా! నీకెప్పుడు కావాలంటే అప్పుడు నన్ను అడిగి తీసుకో!'' అనేసి వెళ్లిపోయాడు.

భూషయ్య మాటలు కనకారావు చెవిలో పడ్డాయి.

''ఆ వెయ్యి రూపాయలు మీకెక్కడివి? ఇంట్లో డబ్బులు కాజేసి వేరేవాళ్ల దగ్గర దాచుకుంటున్నారా?'' కనకారావు సూటిగా అడిగేడు.

''మా వంశంలోనే లేదురా దొంగతనం చేయడం. తండ్రినే శంకించే మనస్తత్వం ఉన్న దౌర్భాగ్యుడివిరా నువ్వు. నీ తమ్ముళ్లను మనవడి మంచిచెడ్డలు చూడకుండా అత్తగారికి, అల్లుళ్లకి దొంగచాటుగా డబ్బు చేరవేసే మొనగాడివి'' అన్నాడు రాజయ్య.


తండ్రీ కొడుకులిద్దరూ రోడ్డుమీద పడటం ఊళ్లోవాళ్లకి ఆనందంగానే ఉంది.

తండ్రీకొడుకుల పోట్లాట రవి తల్లి భారతికి మాత్రం నచ్చలేదు.

''మీరిద్దరూ శత్రువుల్లా పోట్లాడుకుంటూ మీ బాధ్యతలు మర్చిపోయి, ఇంటి ఆర్థిక పరిస్థితులు మెరుగుపర్చకుండా ఒకరిమీద ఒకరు నిందలేసుకుంటూ ఉంటే మీరిద్దరూ 'చేతగాని దద్దమ్మ'లని నలుగురికి చెప్పేసి నాదారి నేను చూసుకుంటా!''

రోడ్డుమధ్యన నిలబడి అందరికి వినబడేటట్లు అనేసింది. భారతి ఆ సమయంలో ఆమె కురుసభలో అవమానం పాలయిన ద్రౌపదిలా ఉంది. తేలుకుట్టిన దొంగల్లా రాజయ్య, కనకారావు తలలొంచుకుని ఇంట్లోకి నడిచేరు.

తల్లి తనను ఎక్కడ వదిలేసి వెళ్లిపోతుందోననే భయంతో తాతయ్య చెయ్యి విదుల్చుకుని తల్లికాళ్లకు చుట్టుకుపోయాడు రవి. ●



## ప్రేమగీతాలు

నీ చేతిలో నా చేయివేసి
నీ జతగా నడుస్తున్నప్పుడు కూడా
పట్టుజారి పోతుందేమోనన్న భయమే
నన్ను ఒంటరిదాన్ని చేస్తుంది!
అన్ని ఆలోచనల మధ్య
సిద్ధాంత రాద్ధాంతాల మధ్య
ఎన్ని పేచీలైనా రానీ
నాకు ఫరవాలేదు
కానీ ఈ రాత్రిని
తెలవారనీయకు!
నీ చేతుల మధ్యలో తప్ప
వేరుగా నన్ను బంధించకు!

— జయప్రభ